www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 జులై 2025
5
అన్నమయ్య

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

'ఉక్కు' పనుల్లో కదలిక!

- వాణిజ్య, పరిశ్రమల శాఖ జిఒ131 జారీ
- 2026 జనవరి నుంచి నిర్మాణ పనులు
- 2034 నాటికి రెండవ దశ పూర్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు కడప ఉక్కు పరిశ్రమ పనుల్లో కదలిక వచ్చింది. జిల్లాలోని జమ్మలమడుగు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి–పెద్దదండ్లూరు గ్రామాల పరిధిలోని 1,350 ఎకరాల విస్తీర్ణంలో జెఎస్‌డబ్ల్యూ రూ.4,500 కోట్లతో ఫేజ్–1, రూ.11,500 కోట్లతో ఫేజ్–2 దశ ల వారీగా రూ.16,350 కోట్లతో మూడు టన్నుల సామర్థ్యంతో కూడిన ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టాలని రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలశాఖ ప్రతిపాదనలు చేసింది. ఈమేరకు జీవో ఎంఎస్ 131 ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఈనెల 12న స్టేట్ ఇన్వెస్ట్ మెంట్ బోర్డు మీటింగ్‌లో ప్రత్యేక ప్యాకేజీతో కూడిన ప్రోత్సాహకాలను కల్పించాలని తీర్మానించింది. 2025 సెప్టెంబర్‌లో ఫేజ్–1 పనులకు అప్రూవల్ ఇవ్వనుంది. 2026 జనవరి నుంచి 2028 ఆగస్టు నాటికి మొదటి దశ ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనుల్ని పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. 2030 సెప్టెంబర్ నుంచి 2033 నాటికి ఫేజ్–2 పనుల్ని పూర్తి చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. 2031 జనవరి నుంచి 2033 ఆగస్టు నాటికి రెండవ దశ ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనుల్ని పూర్తి చేయనున్నట్లు తెలిపింది. ఉక్కు పరిశ్రమ నిర్మాణ కార్యకలాపాల దశ నుంచి అనుమతులు, నిర్మాణ పనులు, యాంత్రీ కరణ, కార్యకలాపాల నిర్వహణ, ప్రొడక్షన్ వంటి కార్యకలాపాలు 20 29 నుంచి 2034 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపింది. వీటితోపాటు జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లి– పెద్దదండ్లూరు గ్రామాల సమీపంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి డబుల్ సర్క్యూట్ విద్యుత్ లైన్ల నిర్మాణానికి 400 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉన్నట్లు పేర్కొంది. దీంతోపాటు గండికోట, మైలవరం జలాశయాల నుంచి రెండు టిఎంసిల నీటి సరఫరాకు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించింది. ఎన్‌హెచ్ – 67 రహదారిని 12 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా అభివృద్ధి పరచాల్సి ఉన్నట్లు తెలిపింది. పిఎం గతిశక్తి పథకం కింద ముద్దనూరు రైల్వేస్టేషన్ (ప్రొద్దు టూరు –యర్రగుంట్ల రైల్వేస్టేషన్) సదుపాయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. వైఎస్‌ఆర్ స్టీల్ కార్పొరేషన్‌కు లభించిన సదుపాయాలను రాయలసీమ స్టీల్ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలని తెలిపింది. ఉక్కు ఉత్పత్తి, మెటీరియల్ రవాణా సంబంధిత అంశాలపై సమీప పోర్టుల నుంచి అనుమతి ఇవ్వాలి. వైఎస్‌ఆర్ కార్పొరేషన్‌కు గతంలో ఇచ్చిన 1,100 ఎకరాలను రాయల సీమ స్టీల్ కార్పొరేషన్ పేరిట ఎకరా రూ.ఐదు లక్షల చొప్పున కొనుగోలుకు బదిలీ చేయాలని అనుమతులు ఇవ్వాల్సి ఉన్నట్లు పేర్కొంది. పైన పేర్కొన్న సదుపా యాలతోపాటు మరో 200 ఎకరాల్లో స్లాగ్ బేస్ తరహాలో టౌన్ షిప్ నిర్మాణానికి సహకరించాలి. వీటితోపాటు ట్రైలర్ మేడ్ సదుపాయాల తరహాలో పెట్టుబడులకు, ఇత్యాది కాలపరిమితి నిబంధనలను అమలు చేయ నున్నట్లు పేర్కొనడం గమనార్హం.

ప్రతి గడపలోనూ ఆనందమే

'సుపరిపాలన తొలిఅడుగు'లో మంత్రి నిమ్మల రామానాయుడు

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పుల్లంపేట

కూటమి పాలనలో ప్రతి గడపలోనూ ప్రజలు ఆనందంగా గడుపుతున్నారని నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేటలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హాజరయ్యారు. ఆయన మంగంపేటలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం నుంచి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొన్ని ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని, ప్రజల శ్రేయస్సును ముఖ్యమని చెప్పారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని ఇది ప్రజల కుటుంబం ఒపై చూపుతున్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. ప్రజల ఆశయాలను నెరవేర్చడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. రూపానంద రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి వృథ సంకల్పంతో రైతాంగ కష్టాలను తీరుస్తూ పంట భూములకు సోమశిల బ్యాక్ వాటర్ అందేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. అనంతరం రూపానందరెడ్డి స్వగృహమైన ముక్కావారి పల్లి గ్రామానికి విచ్చేసిన మంత్రికి స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్, వరలక్ష్మి, విశాల్ రెడ్డి, సాయి వికాస్ రెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు, పసుపులేటి వెంకటరమణ, సౌభాగ్యవతి, అనిత దీప్తి, వెంకటేశ్వ రరాజు, వాసుదేవ రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఘన స్వాగతం పలికారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి నిమ్మల విచ్చేసిన సందర్భంగా కస్తూరితో పాటు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్ రాయులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతి విభాగ అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, తదితరులు గజ మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి రమణ, లారీ సుబ్బ రాయుడు, అజయ్ బాబు, పి.కె. నాయుడు, హస్తి చంద్రరాజు పాల్గొన్నారు.

35వ డివిజన్‌లో పర్యటించిన మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సుపరిపాలనలో తొలి అడుగు–ఇంటింటికి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం కడప నగరంలోని 35వ డివిజన్‌లో పర్యటించారు. పెద్దదర్గా నకాస్ నుంచి ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు అవుతూ ఉన్నాయని చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లల చదివితే అంతమందికి రూ.13వేలు తల్లుల ఖాతాల్లో జమ అయిందని తెలిపారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలిసి కెసి కెనాల్, బుగ్గవంక పరిశుభ్రత పనులను పరిశీలించారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

మాట్లాడుతున్న శ్రీనివాస్ రాజు

ప్రజాశక్తి - రాయచోటి

ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతలు పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన పొజిషన్ ఐడీలు వెంటనే కేటాయింపు చేసి జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డైట్ కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నమోదుకు గతంలో ఇచ్చిన హామీలను అనుసరించి ఉదయం తొమ్మిది గంటల పది నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్‌గా ప్రకటించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలు అయినప్పటికీ పదవతరగతి స్పాట్ వాల్యుయేషన్ విధులు నిర్వహించిన వారికి పైకం చెల్లించకపోవడం దారుణం అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లి రిలీవర్ రాకపోవడం వల్ల పూర్వపు పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు వెంటనే రిలీవ్ చేయాలని చెప్పారు. డిఎస్‌సి ఉపాధ్యాయులు వచ్చేవరకు ఎంత సమయం పడుతుందో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే విద్యా వాలంటీర్లు నియమించి వారికి ఉపశమనం కల్పించి విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. 2003 నోటిఫికేషన్ ద్వారా నియామకం ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ప్రభుత్వం కొన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ నాయకులు మధుసూదన్ రెడ్డి, పకీర, నరసింహారెడ్డి, బచ్చల శ్రీనివాసులు, వేణుగోపాలరావు, కులశేఖర్ రెడ్డి, గోవిందు నాగరాజ, రాజబాబు, ఆసిఫ్, వెంకటరామరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిదాటినా ఇంటింటికి సుపరిపాలన పేరుతో టిడిపి ప్రచారం చేసుకుంటుందని ఒక్క సమస్య పరిష్కారం కాలేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండల నాయకులు, లింగాల యానాదయ్య, సుబ్బరామయ్య, నాగి పోగుపెంచలయ్య, కరతోట హరి నారాయణ, బండారు రాజశేఖర్, సుభానుతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఎన్నికల వాగ్దానాల్లో దీర్ఘ కాలిక సమస్యలు మాటలకే పరిమితం అయ్యాయని అన్నారు. రాజధానికి దగ్గరగా ఉండే వెంకటగిరి రోడ్డు అటవీశాఖ అనుమతి లేక ప్రారంభించలేదని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మైసూరువారిపల్లికి వచ్చిన సందర్భంగా తెలిపారని అన్నారు. కోడూరులోబైపాస్ రోడ్డు, గత 30 సంవత్సరాలుగా కలగానే మిగిలిపోయిందని అన్నారు. నరసరాంపేట, ధర్మాపురం, గుంజననది 2005లో వచ్చిన వరదలకు కొట్టకపోందని, 2013లో రక్షణ గోడకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకుండా వాయిదాలు వేసుకుంటున్నారని తెలిపారు. రైల్వే అండర్ బ్రిడ్జి, రెడ్డివారిపల్లి బ్రిడ్జి, గత ప్రభుత్వం నుంచి పనులు కాలయాపన చేస్తూ, ప్రారంభానికి నోచుకోలేదన్నారు. పండ్లకు ప్రసిద్ధిగాంచిన కోడూరులో మూసివేసిన అప్ప జ్యూస్ ఫ్యాక్టరీ తేరిపించలేదన్నారు. ఎపి ఎంపిడిసి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని సమ్మె చేయొద్దని కార్మిక సంఘాల నాయకులకు మంత్రి సమక్షంలో హామీ ఇచ్చి ఏడు నెలలు దాటినా కనీసం ఎండితో అపాయింట్మెంట్ లేదంటే సమస్యల పరిష్కారం పట్ల వీరి చిత్తశుద్ధి ఎలాంటిదో అర్థమ వుతుందని అన్నారు. ఇళ్లు, భూములను ఇచ్చిన పున రావాస బాధితుల సమస్యలు పరిష్కరించ లేదన్నారు. సోమశిల బ్యాక్ వాటర్ ఎత్తిపోతల పథకం ద్వారా పెనగలూరు, చిట్వేలికి తెప్పిస్తామని గత ప్రభుత్వం నుంచి మాటలకే పరిమితమైందని అన్నారు. గాలేరు–నగరి పనులు ఒక ఇంచి కూడా కదల్లేదని, దాని ప్రస్తావన లేదన్నారు. ఓబులవారిపల్లి రైతులకు ఉపయోగపడే బంద్రేవు కోన, ఇందిరా సాగరు,చెరువులు ప్రారంభిం చలేదన్నారు. పుల్లంపేట రాజంపేటకు, ఉపయోగపడే, అన్నమయ్య ప్రాజెక్టు, గత ప్రభుత్వంలో కొటుకుపోతే దాన్ని నిర్మించడానికి కనీస ప్రయత్నం చేయడం లేదన్నారు. రైతులకు ఉపయోగపడే కోల్డ్ స్టోరేజ్ లు, కోడూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం, మైనింగ్ యూనివర్సిటీ, స్టేడియం,పేదల వివాహాలకు టిటిడి కల్యాణ మండపం, గురించి పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ పథకాలు, అంగన్వాడీ, విఆర్ఎ, మున్సిపల్, ఆశ, ఆనిమేటర్, స్కీం వర్కర్లకు కోత విధిచ్చారన్నారు. పభుత్వం ఇస్తానన్న సబ్సిడీ ఇవ్వలేదన్నారు. బొప్పాయి రైతులు దళారుల సిండికేట్ వల్ల రేటు తగ్గించారని గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. దళితులు గిరిజను, కార్పొరేషన్లకు, నిధులు లేక, ఆర్థిక సహాయం అందడం లేదన్నారు. భూమి, ఇల్లు, పక్కా గృహాలు, ఏమి ఇవ్వలేదన్నారు. విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తౌహిద్ ఖాన్ సేవలు హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : అబ్దుల్ కలామ్ సేవా సమితి స్థాపించి ఎంతో మందికి చేయూతనిస్తున్న సమితి అధ్యక్షులు తౌహిద్‌ఖాన్ సేవలు హర్షణీయమని ఆడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు పి.షరీఫ్‌ఖాన్ అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ 10వ వర్ధంతి సందర్భంగా నగర శివార్లలో ఉన్న బృందా వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ భారతదేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని తెలిపారు. కలామ్ మీద ఉన్న అభిమానంతో తన కుమారుడు తౌహిద్ ఖాన్ మిత్రులతో కలిసి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు.

పొగలను అదుపులోకి తెస్తున్న రైల్వే, ఫైర్ సిబ్బంది

జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

అదుపులోకి తెచ్చి ఫైర్, పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి - నందలూరు

కన్యాకుమారి నుంచి పూణే వెళ్తున్న జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు వ్యాపించాయి. సిబ్బంది గుర్తించి ఫైర్, రైల్వే పోలీసులు పొగలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం నందలూరు రైల్వే కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు కన్యాకుమారి నుంచి పూణేకు బయలు దేరింది. నందలూరు సమీపంలోని హస్తవరం వద్దకు చేరుకోగానే 3 ఎసి కోచ్ నెంబర్ (22324) భోగి కింద పొగలు రావడానికి గమనించిన స్టేషన్ సిబ్బంది నందలూరు స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన నందలూరు స్టేషన్ మేనేజర్ కమలాకర్, స్టేషన్ మాస్టర్ మురళీమోహన్ రాజంపేట ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. రైలు లోకో పైలట్, గార్డ్‌తో వాకీ – టాకీలో మాట్లాడి ట్రైన్‌ను నందలూరు రైల్వే గేట్ దగ్గర ఆపి రాజంపేట ఫైర్ సిబ్బందితో పొగలను అదుపు చేశారు. బి–2 ఎసి కోచ్ బ్రేక్స్ సరిగా రిలీజ్ కాకపోవడం వల్ల ఈ మంటలు వచ్చాయని రైల్వే అధికారులు తెలియజేశారు. రైల్వే సిబ్బంది బ్రేక్స్ రిలీజ్ చేసుకొని తిరిగి రైలును కదిలించారు. సరైన సమయంలో రైల్వే సిబ్బంది అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ స్కూల్‌లో తరగతులను బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సమీర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా ఆదివారం కూడా పాఠశాలను నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఆట, పాటలతో ఉత్సాహంగా ఆడుకోవాల్సిన విద్యా ర్థులను చదువు పేరుతో నాలుగు గోడల మధ్య బందీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఇఒ డిప్యూటీ డిఇఒడి పత్రికా ప్రకటనలకే పరిమితమౌతున్నారు తప్ప నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుల్తాన్, హేమంత్, ఎఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలుపై అనంతపురం జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

ఎసిఎ సౌత్ జోన్ అండర్ –16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 221 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 210 పరుగులు చేసింది. కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 125 పరుగులు చేసింది. ఏడు వికెట్లు నష్టానికి 257 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 70.4 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 295 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని సాత్విక్ 131, దేవాన్ష్ 41 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని జితేష్ వర్ధన్ మూడు, వివేక్ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన 49.1 ఓవర్లలో 159 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది. అనంతపురం జట్టులోని కిరణ్ కుమార్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు.

వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, నెల్లూరు జట్ల నిర్వహించిన వేరొక మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 270 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 288 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 40 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 99.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 414 చేసింది. ఆ జట్టులోని హర్ష 167 పరుగులు (సెంచరీ), తనీశ్వర్ టెండూల్కర్ (102) పరుగులు సెంచరీ చేశారు. నెల్లూరు జట్టులోని సుశాంత్ రెండు, రిత్విక్ రెండు వికెట్లు తీసుకున్నారు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

మేటి రచయిత కృష్ణస్వామి

ప్రజాశక్తి- కడప అర్బన్

విజ్ఞానాన్ని, యుక్తిని మేళవించి బాలసాహిత్యాన్ని సృష్టించిన మేటిరచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు అని విశ్రాంత తెలుగు పండితులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న (తిరుపతి) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 145వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ కథాసాహిత్యానికి వన్నె తెచ్చిన కథకుల్లో ఆర్.సి. కృష్ణస్వామి రాజు ఒకరని, బాలసాహిత్యకర్తగా కూడా ఆయన గురుతరమైన బాధ్యతను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఆయనవి చిన్నాపెద్దా కథలు 650 దాకా వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయని తెలిపారు. వీటిలో 150 పిల్లల కథలు ఉండడం విశేషమన్నారు. ఆర్.సి. కృష్ణస్వామి రాజు తిరుపతి జిల్లా పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందినవారన్నారు. ఇప్పటి వరకు భిన్న వర్గాలకు చెందిన 18 కథా సంపుటాలను, 2 నవలలను వెలువరించారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచనలు చిత్తూరు జిల్లా మాండలికంలో, జనం మాట్లాడుకొనే భాషలో ఉంటాయని చెప్పారు. అక్కడి ప్రాంతాలే ఆయన కథాకేంద్రాలుగా ఉంటాయన్నారు. కార్యక్రమం అనంతరం వక్త డాక్టర్ నెమిలేటి కిట్టన్నను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి సన్మానించారు.

మహిళా నర్సులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్

జర్మని దేశంలో అత్యధిక సంఖ్యలో వృద్ధుల అవసరాలకు తగ్గట్టుగా నర్సులు లేకపోవడంతో అక్కడి ప్రభుత్వం మన దేశంలోనే వివిధ రాష్ట్రాల నుంచి నర్సులను నియమించుకునే ప్రయత్నం చేస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి నర్సింగ్ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి జర్మని దేశంలో అధిక వేతనం, ఉద్యోగ భద్రత అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. వివిధ సంస్థలలో నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారికి శిక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. రాష్ట్రంలో మూడు కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రం ద్వారా 50 మంది మహిళలకు చొప్పున మొత్తం 150 మందికి జర్మన్ భాషలో ఉచిత శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 8 నుంచి 10 నెలల పాటు నర్సింగ్‌లో డిగ్రీ పట్టా పొందిన ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇస్తారని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఒప్పందం కుదురుచుకుని విశాఖ, గుంటూరు, తిరుపతి కేంద్రాలలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు 35 సంవత్సరాలు మించకుండా ఉండాలని తెలిపారు. బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసి రెండు సంవత్సరాలు క్లినిక్‌లో అనుభవం ఉండాలని పేర్కొన్నారు. జిఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడు సంవత్సరాలు క్లినికల్ అనుభవం ఉండాలని తెలిపారు. శిక్షణ పొందిన వారు బి–2 స్థాయి పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. హార్డ్ కాపీని జిల్లా షెడ్యూల్ సంక్షేమ, సాధికారత శాఖ, న్యూ కలెక్టరేట్, అంబేద్కర్ భవన్, చిత్తూరు జిల్లాలో అందజేయాలని పేర్కొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.శివన్నారాయణ

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించడమే తమ ధ్యేయమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి. శివన్నారాయణ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాల్లో వ్యవసాయ శాఖ కార్యాలయాలు సిబ్బంది, ఖరీఫ్ సాగు విస్తీర్ణం, రైతుల ఎంత సాగు చేశారో, రైతులు ఎలాంటి మందులు వాడాలో ఖరీఫ్ పంటలను అధిక దిగుబడి సాధించడానికి రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో వ్యవసాయ శాఖ కార్యాలయాల వివరాలు తెలపండి?

జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా వ్యవసాయ కార్యాలయం ఉంది. జిల్లా వ్యాప్తంగా మదనపల్లి, వాల్మీకిపురం, పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాలలో ఏడీ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 30 మండలాలున్నాయి. ప్రతి మండలంలో మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఉంది.

జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఎంత? రైతులు ఎంత సాగు చేశారు?

జిల్లా వ్యాప్తంగా 57,003 హెక్టార్లలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. ఇప్పటివరకు 4, 286 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. 7.52 శాతం సాగైంది.

రైతులు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

జిల్లా వ్యాప్తంగా రైతులు కావాలసిన అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా యూరియా, డిఎపి , ఎంఒపి, ఎన్‌టిపి, ఎస్–ఎస్‌పి మొదలైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఎరువులు అన్ని గ్రామీణ ప్రాంతంలోని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ఎరువులు కొరత లేదు.

జిల్లాలో ఎంతమంది కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేశారు?

2024 - 2025 సంవత్సరంలో 6వేల మంది రైతులకు గాను 5,137 మందికి పంపిణీ చేశారు. సుమారు 85.6 శాతం గుర్తింపు కార్డులు పంపిణీ చేశాం.

ఖరీఫ్ సాగుకు ఇ క్రాప్ నమోదు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారు?

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌కు ఇ క్రాఫ్ నమోదు ప్రక్రియ ప్రారంభించాం. పంట సాగు చేస్తున్న రైతులందరూ ఇ క్రాప్ కోసం పేర్లను నమోదు చేసుకోవచ్చు.

జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ సంబంధించి సిబ్బంది కొరత గతంలో ఉండేది. ప్రస్తుతం సరిపడ సిబ్బంది ఉన్నారు. వ్యవసాయ శాఖ లో ఎటువంటి సిబ్బంది కొరత లేదు.

రైతులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

రైతులు విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడరాదు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పచ్చి రొట్ట, ఎరువులు,సేంద్రియ ఎరువులు వాడాలి. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలి. . బెట్ట మట్టు తట్టు కొవో, తృణ ధాన్యాలు, కంది, పెసరు, అలసందలు, అనుములు, ఆముదం వంటి పంటలను రైతులు సాగు చేయాలి. మిశ్రమం వ్యవసాయం, సమ్మిలత వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంభించాలి.

శివరామ్‌ను సన్మానిస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన జంగాల శివరామ్ ను మదనపల్లె లారీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఆయన స్వగృహంలో దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లారీ యజమానులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. ప్రమాణ స్వీకారం అనంతరం మార్కెట్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో మార్కెట్ యార్డ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ఉపాధ్య క్షుడు జె.ఎల్ సుధాకర్‌నాయుడు, సెక్రటరీ అహ్మద్‌పీరా, కోశాధికారి సురేంద్రనాయుడు, సంయుక్త కార్యదర్శి గంగాధర్, సభ్యులు షమి, శివ, బాబు, నాగభూషణం,హుస్సేన్ బాషా, సర్వర్ హుస్సేన్, రసూల్, వెంకటేష్, రామ్మోహన్, దాము పాల్గొన్నారు.

సిఎస్ఐ జెసిఎం చర్చ్ పాస్టర్‌గా డాక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలోని సిఎస్ఐ జెసిఎం చర్చి పాస్టర్‌గా రెవరెండ్ డాక్టర్ కె.ఆనంద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రెవరెండ్ డాక్టర్ సునీల్ వరకుమార్ హైదరాబాద్ లోని ఎసిటిసి కాలేజ్ ప్రిన్సిపల్ గా బదిలీ అయ్యారు. పులివెందులలో పనిచేస్తున్న రెవరెండ్ ఆనంద్ ఇక్కడికి వచ్చారు. మదనపల్లె చర్చిలో ఏడేళ్ల పాటు సుదీర్ఘ సేవ చేసిన రెవరెండ్ సునీల్ వరకుమార్, లూసీ దంపతులను చర్చి కమిటీ సభ్యులు ఆనంద్, భక్తవత్సలం, సుజాత దీన, జుగ్ను, శేఖర్, చర్చి సభ్యులు దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ఎంపిడిఒను సన్మానిస్తున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

ఎంపిపిని కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్‌ను ఎంపిడిఒ భాను ప్రసాద్ మర్యాదపూర్వక కలిశారు. గత కొన్ని రోజులు క్రితం ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎంపిపిని కలిసి మండల అభివృద్ధిపై సమీక్షలు జరిపినట్లు తెలిపారు. మండలంలో పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, తాగునీటి సమస్య, ఉపాధి హామీలో జరుగుతున్న పలుకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నారా లేదా అని ఆరా తీసినట్టు తెలిపారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస్ కూడా ఎంపిపిని కలిసినట్టు తెలిపారు.వ్యవసాయంపై పట్టు ఉన్న మండల రైతులకు సకాలంలో వేరుశనగ విత్తనాలు, ఆరుతడి పంటలపై విత్తనాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించినట్టు తెలిపారు. అనంతరం దేవులపల్లి పంచాయతీ దేవులపల్లిలో మాలేపాటి రెడ్డప్ప ఆధ్వర్యంలో జరిగిన నాగ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఎంపిపి తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలతో నిండిన మహాత్మ గాంధీ విగ్రహం

-పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలు

మండల కేంద్రం గాలివీడులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ చెత్తా, చెదారం, వ్యర్థాలతో నిండి ఉంది. స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహం చుట్టూ వ్యాపారస్తులు తన జీవనోపాధి కోసం గోబి , బజ్జి, చికెన్ పకోడా, కూరగాయల బండి, చికెన్, మటన్ దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటి నుంచి వచ్చే వ్యర్థాలను అక్కడ వదిలేసి వెళుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలను ప్రతి ఒక్కరూ చూస్తూ వెళుతున్నారే తప్ప వాటిని తొలగించే ఆలోచన ఎవ్వరి రాకపోవడం శోచనీయమని అంటున్నారు. స్వచ్ఛ ఆంధ్ర పేరుతో పారిశుధ్య పనులు చేపట్టే అధికారులకు ఇక్కడ ఉన్న వ్యర్థాలు కనిపించకపోవడం భాదకరమని అన్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించి విగ్రహం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతమయ్యాయి. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో స్త్రీ, పురుషులకు జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా నలుమూలల నుండి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి 100 మీ, 200 మీ, 400 మీ, ఎనిమిది వందల మీ, లాంగ్ జంప్, జావలిన్ త్రో, షాట్ పుట్, హై జంప్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందించారు. రాష్ట్రస్థాయి క్రీడలకు 40 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరగబోయే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ క్రీడల నిర్వహణలో వ్యాయామ సంచాలకులు నాగూర్ బాషా, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, శంకర్, బి.బాషా, నాగేశ్వరరావు, ఖాదర్ రెడ్డి, దిలీప్, కోచ్ వివేకానంద రెడ్డి, సీనియర్ క్రీడాకారులు రబ్బాని, భార్గవ్ సహకరించారని, వారందరికీ బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహ్మద్ బాషా, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ధన్యవాదాలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కొండాపురం రూరల్

మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నదే లక్ష్యమని ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లబోతుల కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం కొండాపురంలోని ఆటో గంగమ్మను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో గంగమ్మ ఆటో నడుపుతూ జీవనం సాగించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. పురుషులతో సమానంగా ఆటో నడుపుతూ పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. అలాంటి మహిళకు తమ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో అన్ని రకాలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. డేరా జ్యోతి మాట్లాడుతూ ఓ సాధారణ మహిళ జీవనోపాధి కోసం ఆటో నడపడం పలువురికి ఆదర్శమన్నారు. కార్యక్ర మంలో ఆవుల కిషోర్, కొలిమికుంట్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్డు

- గుంతలమయంగా మారిన వైనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టని అధికారులు

గంగనేరునదిపై ద్విచక్ర వాహనం ఎక్కాలంటే భయపడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి. రాచపల్లె, వంగిమళ్ళ, వనంకాడపల్లి, కావలిగడ్డ, రామన్నవారిపల్లి, నల్ల పర్వతాయగారిపల్లి, టెంకాయచెట్లపల్లి, నాగిరెడ్డిపల్లి, పెద్దూర్ కస్బా, ఆర్యంరెడ్డిపల్లి, రాచపల్లి, బలిజపల్లి, కళ్ళేవాండ్లపల్లి, ఉప్పరపల్లి, గ్రామాల నుంచి వీరబల్లి కు వెళ్లే రోడ్లు గుంతలమయమై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా మండల కేంద్రం నుంచి వంగిమళ్ళ రోడ్డుకు మోక్షం లేదు. గత టిడిపి ప్రభుత్వంలో మాండవ్య నది పైన, గంగనేరు నది పైన బ్రిడ్జ్ లు నిర్మించారు. అప్పట్లో ఎక్కువ వర్షాలు పడడం వలన గంగనేరు బ్రిడ్జ్ వరదలకు కొట్టుకుపోయింది. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ బ్రిడ్జి గురించి రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఎంపిపి గ్రాంట్ కింద ఏటిలో ఇసుక పైన మట్టి తోలి బిల్ పాస్ చేసుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గంగనేరు నది నుంచి పైకి ద్విచక్ర వాహనాలు ఎక్కి పోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని అన్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు వీరబల్లికి పోవాలంటే చాలా అవస్థలు పడుతున్నామని వాపోయారు. టిడిపి, వైసిపి, ప్రభుత్వాలు ప్రజల దగ్గర ఓట్లు వేయించుకొని మీకు మేమున్నాం.. మీ సమస్యలను మేము తీరుస్తాం.. మాకు ఓటు వేయండి అని బొంకు మాటలు చెప్పి ఇచ్చిన మాటలు నిలబెట్టుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఆ గుంతల్లో గ్రావెల్ తోలమని ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని అంటున్నారు. గుంతల పడి వర్షపు నీరు నిలిచి రోడ్డు అంత అధ్వానంగా మారింది, ఆటోలు ద్విచక్ర వాహనాలలో వెళ్లాలంటే ఎగుడు దిగుడుగా ఉన్న ఆ రోడ్లు ఎక్కడ జారిపడతామో అనే భయం వేస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ రెండు పంచాయతీల్లో తెల్ల చొక్కాలు వేసుకున్న బడా రాజకీయ నాయకులు ఉన్నా, ఆ రోడ్డు పరిస్థితి మార్చే నాథుడే లేడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే మండలానికి పోవాలంటే చాలా అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. మండలంలో జడ్‌పిహైస్కూల్, జూనియర్ కళాశాల, కెజిబివిపాఠశాల విద్యార్థులు ఈ రోడ్డు ద్వారా వెళ్ళాల్సి వస్తోందని చాలా ఇబ్బందిగా ఉందదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఎంపిడిఒ కార్యాలయం, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

గుంతలమయమైన రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం :వైసిపి

బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లిలో రమేష్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్‌పి చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో దృతరాష్ట్ర పాలన కొనసాగుతోందని శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు 175 మంది చంద్రబాబు పక్షాన అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. పులివెందులలో టిఫిన్ అనే కంపెనీకి రూ.10 కోట్ల విలువైన బైరటీస్ నిల్వ ఉంచితే రాత్రికి రాత్రి టిప్పర్లతో దొంగతనం చేశారని అన్నారు. ప్రతి పల్లెలో బెల్ట్ షాపులు విపరీతంగా పెట్టారు బెల్ట్ షాప్ వలన తాగుడు విపరీతంగా పెరిగిందన్నారు ప్రజల సంపాదనంతా తాగుడుకే ఖర్చవుతుందని అన్నారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నయవంచన చేస్తున్నారని అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వడం లేదని, జాబ్ కేలండర్ విడుదల చేయకుండా, ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లింకుండా యువతను దగా చేశారన్నారు. చంద్రబాబు మొదటి సంతకం మెగా డిఎస్‌సి 16 వేల టీచర్ పోస్టుల కోసం పెట్టారని, అదే జగన్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 1.40 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించారన్నారు. 18 ఏళ్లు నిండి 59 ఏళ్ల వయసు వరకు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని మోసాగిం చారన్నారు. అనంతరం బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తుండడం మంచి పద్ధతి కాదని తెలిపారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళదామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కలాడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు అంబాబత్తిన రెడ్డెయ్య, తిమ్మిరెడ్డి ఉమాపతిరెడ్డి, ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి సుబ్బరాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని పెద్దూరుకస్బాల్లో ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణం డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తోంది. పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రాంగణంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాటశాల, ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠ శాల ఇలా నాలుగు పాఠశాలల సముదాయం ఉంది. పాఠశాలలో ఆవరణం పూర్తి చెత్తా, చెదారం, వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లు తుండ టం తో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలతో దోమలు విజృంభించి విద్యార్థులు అనారోగ్యం బారి న పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఒకవైపు దుర్వాసన వస్తుండ టంతో మధ్యాహ్న భోజనం చేయాలంటే కష్టంగా ఉందని అంటున్నారు. పంచా యతీ అధికారులు డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయకపోవడంతో ప్రతి ఒక్కరూ అక్కడే వ్యర్థాలను వేస్తున్నారని అన్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టిపెట్టి వ్యర్థపదార్థాలతో నిండిపోయిన ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చెత్తా, చెదారం వ్యర్థాలతో నిండినపాఠశాల ప్రాంగణం

సతీష్‌రెడ్డి మనస్తత్వం పులివెందుల ప్రజలకు తెలుసు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సతీష్‌రెడ్డి మనస్తత్వం పులివెందుల ప్రజలకు తెలుసునని, లోకేష్ వద్ద టిడిపి నాయ కులు మెప్పు కోసమే ఆయనపై విమర్శలు చేస్తు న్నారని వైసిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చడం గురించి జబ్బలు చరుస్తూ మాట్లాడే మీరు.. ఒకసారి వైసిపి విడుదల జేసిన క్యూఆర్ కోడ్ ఓపెన్ చేసి మీ నాయకులు ఇచ్చిన హామీలు చూస్తే సిగ్గుపడాల్సిన పరిస్థితి అన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లా డటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎక్కడి గురించో మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు.. మన పులివెందులలో అభంశుభం తెలియని మైనర్ విద్యార్థులపై అక్రమంగా హత్యాయత్నం కేసు పెట్టించిన దుస్థితి టిడిపి నాయ కులదన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగంతోపాటు అక్రమ రేషన్ రవాణా, పేకాట, గంజాయి, మహి ళలపై అత్యాచారాలు, భూ కబ్జాలు, అనధికార మద్యం బెల్ట్ షాపులు వంటి వాటితో శాంతి భద్రతలను నాశనం చేసి భ్రష్టు పట్టించారని విమర్శించారు. పులివెందుల ప్రాంతంలో ఉన్న అన్ని నీటి ప్రాజెక్టులలో నీరు పుష్కలంగా ఉన్నా రైతులకు సాగు నీరు లేక ఇబ్బందులు పడుతుంటే వారి గోడు ఏమాత్రం అయినా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపో యాయని అధికారులు చెబితే పట్టిచుకొనే నాథుడే లేడన్నారు. వీటిపై తమ నాయ కుడు ఎంపీ అవినాష్‌రెడ్డి తాను ఏర్పాటు చేస్తానని ముందుకు వస్తే ఆ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించవద్దని అధికారులను మీరు బెదిరించలేదా అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వేముల మండల కన్వీనర్ సాంబశివారెడ్డి, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షులు రసూల్, జెడ్పిటిసి బయ పురెడ్డి,తొండూరు మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, పులివెందుల మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మెన్ సర్వోత్తమరెడ్డి, లింగాల మండల కన్వీనర్ బాబురెడ్డి, వైస్ చైర్మెన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, జిల్లా నాయకులు నూరుల్లా, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి నిరంతరం కృషి

డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ ఇండిపెండెంట్ సైంటిస్ట్ రామిశెట్టి శివశంకర

ప్రజాశక్తి - తొండూరు

రైతు సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చే స్తూనే ఉంటానని డాక్టర్ ఆర్ ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ ఇండిపెండెంట్ సైంటిస్ట్ రామిశెట్టి శివశంకర్ పేర్కొ న్నారు. మండలంలోని గంగన పల్లె వ్యవసాయ క్షేత్రంలో ఆది వారం రీసెర్చ్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా రీసెర్చ్ ఫౌండేషన్ తరపున తయారు చేసిన సూర్యపుత్ర ఆర్గానిక్ పంట పురుగుమందును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ చదివిన చదువు, ఊరికి, దేశానికి ముఖ్యంగా రైతులకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ స్థాపించానని తెలిపారు. ఈ నేపథ్యంలో చీని, అరటి, ఇతర పండ్ల తోటల రైతులకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లి తగిన సూచనలు ఇచ్చానని తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ వ్యవసాయ క్షేత్రంలో గోశాలను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లూ క్రాఫ్ట్ ఎండి రాంబాబు, ధరణి బయో ఆర్గానిక్ సీఈవో సతీష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సానా కొండారెడ్డి, చక్రపాణి హాస్పిటల్ ఎండి డాక్టర్ చక్రపాణి, పలువురు శాస్త్రవేత్తలు, వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు. అనంతరం వేంపల్లికి చెందిన కవి అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఎంఇఎఫ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పల్లె గంగాధర్

ప్రజాశక్తి - ఖాజీపేట : మాదిగ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎంఇఎఫ్ మండల అధ్యక్షులు పల్లె చిన్న గంగాధర్ అన్నారు. ఆదివారం ఖాజీపేటలో నూతన మండల ఎన్నిక నిర్వహించారు. ఎంఇఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జోనస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలాజీ అధ్యక్షతన ఎన్నిక నిర్వహించారు. మండల ఎంఇఎఫ్ అధ్యక్షులుగా పల్లె చిన్న గంగాధర్, ఉపాధ్యక్షులుగా దేవదానం, ప్రధాన కార్యదర్శిగా సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శిగా రామసుబ్బమ్మ, కోశాధికారిగా బాలస్వామి, గౌరవ అధ్యక్షులుగా రవిప్రకాష్, గౌరవ సలహాదారుడిగా గంగాధర్ ఎన్నికయ్యారు.

గండిలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట : ప్రముఖ పుణ్యక్షేత్రం గండి శ్రీవీరాంజనేయ స్వామి శాశ్విత నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పులివెందుల పట్టణానికి చెందిన పబ్బతివారి శ్రీకృష్ణ జ్యువెలర్స్ పబ్బతి రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం కృష్ణవేణమ్మ కుమారుడు దక్షిణామూర్తి ధర్మపత్ని లక్ష్మీ ప్రసన్న రూ.1,01,116 నగదు విరాళంగా ప్రకటించారు. ఆ మొత్తాన్ని దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకులు వర్తి కేసరి స్వామి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. ఆలయ పాలకమండలి పబ్బతి బిందు సాగర్, ప్రత్యేక ఆహ్వానితు సభ్యులు పీర్ల కొండారెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ జీవన్‌గంగానాథ్‌బాబు

మాదకద్రవ్యాలపై అవగాహన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

విద్యార్థులు మత్తు పదార్థాలు, ర్యాగింగులకు దూరంగా ఉండాలని సిఐ జీవన్‌గంగానాథ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం కస్తూరిబా జూనియర్ కాలేజ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్, మైనర్ డ్రైవింగ్ శక్తి యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని, వాటికి బానిసైతే భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందన్నారు. సైబర్ నేరాలు అధికమైపోయాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒటిపిల పేరుతో ఖాతాలలో నగదు మాయం చేస్తారన్నారని అన్నారు. మత్తు పదార్థాలు,ర్యాగింగ్ వంటివి మీ పరిసరాలలో ఎక్కడైనా జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎపిజె అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ భారత రాష్ట్రపతి, భారత క్షిపణి పితామహుడైన ఎపిజె అబ్దుల్ కలాం అందరికీ అదర్శం, స్ఫూర్తిదాయకమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కాంగ్రెస్ కార్యా లయంలో ఎపిజె అబ్దుల్ కలాం 10వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కలాం నిరాడంబరతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, వేమారాజా, బద్రినాథ్, హన్సికారెడ్డి పాల్గొన్నారు.

టిడిప సీనియర్ నాయకురాలు సుబ్బలక్ష్మమ్మ మృతి బాధాకరమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. సుబ్బలక్ష్మమ్మ క్రమశిక్షణతో కూడిన హుందా రాజకీయాలు చేశారని కొనియాడారు.

క్రైం కార్నర్

పట్టుబడిన వాహనం, ఎర్రచందనం దుంగలతో అటవీ సిబ్బంది

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ క్షేత్రాధికారి జయప్రసాద్ తెలిపారు. శనివారం రాత్రి గస్తీలో భాగంగా తమ సిబ్బంది పీలేరు పట్టణ శివారులోని బోడుమల్లువారిపల్లి వద్ద, పీలేరు-కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న వంతెన సమీపంలో వాహనాలు తనిఖీ చేపట్టారన్నారు. ఈ సందర్భంగా ఓ వాహనం వేగంగా పీలేరు వైపు రావడాన్ని గుర్తించి దాన్ని ఆపేందుకు ప్రయత్నించారన్నారు. ఆ వాహన డ్రైవర్ ఆగకుండా మరింత వేగంగా ముందుకు దూసుకువెళ్లాడని, అప్రమత్తమైన తమ సిబ్బంది ఆ వాహనాన్ని వెంబడించగా సదరువాహన డ్రైవర్ చీకటిలో వాహనాన్ని ఆపి పరారయ్యాడని తెలిపారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 1675 కేజీల బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాహనంతో సహా ఎర్రచందనం దుంగలను కార్యాల యానికి తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఒ సబి హాసుల్తానా, ఎఫ్‌బిఒ శ్రీనివాసన్, బేస్‌క్యాంప్ సిబ్బంది, డ్రైవర్ నాగేంద్ర పాల్గొన్నారు.

ఇరు గ్రూపులు ఘర్షణ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలం కోసం ఇరు గ్రూపులు ఘర్షణ పడడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. పోతబోలు పంచాయతీ గాండ్లపల్లి కు చెందిన విజయకుమారి కట్టెలను తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో నిల్వ చేసుకుంటుండగా వీరి బంధువులు రాధాకృష్ణ, రత్న దంపతులు అడ్డుకున్నారు. ఈ స్థలం తమదని ఇక్కడ కట్టెలను నిల్వ చేయకూడదని ఘర్షణకు దిగారు. ఇరువర్గాల వారు పరస్పర దాడులకు దిగడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు అడ్డుకొని బాధితులను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యా యత్నానికి పాల్పడిం ది. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..పెంచుపాడు పంచాయతీ, దాదినాయుని తండాకు చెందిన బాలాజీనాయక్ భార్య శాంతమ్మ(35) కుటుంబ సమస్యలపై గొడవ పడింది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధ్యతురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుడు..

మదనపల్లె అర్బన్ : భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం తంబళ్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధిత యువకుడి బంధువుల వివరాల మేరకు.. కోసువారిపల్లి సమీపంలోని వడ్డిపల్లికి చెందిన నాగార్జున భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ యువకుడికి తల్లిదండ్రులు లేకపోవడంతో అవ్వ పాపమ్మ పోషించుకుంటూ ఆలనాపాలనా చూస్తోంది. నాగార్జున అవ్వవద్ద ఉంటూ పనులకు వెళ్లి జీవనం చేసేవాడు. ఈ క్రమంలో ఏమి జరిగిందో తెలియదు కానీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వృద్ధాప్యంలో ఉన్న పాపమ్మ స్థానికుల సాయంతో మనవడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. తంబళ్లపల్లి పోలీసులు విచారణ చేస్తున్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పుంగనూరు మండలం, పత్రపల్లి తండా కు చెందిన శివశంకర్ భార్య పద్మ సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వచ్చారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి సాయిబాబా గుడి వీధిలోకి వెలుచుండగా అటుగా వచ్చిన బొలెరో వాహనం ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మ తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. రెండో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.